క్లుప్తంగా

పోలీసులకు వెన్నుదన్నుగా..


హోంగార్డులతో మాట్లాడుతున్న కర్నూల్ రేంజ్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్

చిత్తూరు అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అరికట్టడంలో హోంగార్డులు పోలీసులకు వెన్నుదన్నుగా ఉంటున్నారని కర్నూల్ రేంజ్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్ పేర్కొన్నారు. చిత్తూరులోని హోంగార్డ్ యూనిట్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. హోంగార్డులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తూ పోలీసుశాఖకు మంచి పేరు తేవాలన్నారు.అనంతరం సంక్షేమ పథకాలను వివరించారు. మెడికల్ క్యాంపు నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

శేషవాహనంపై చిదంబరేశ్వరుడు


శేషవాహనంలో ఊరేగుతున్న స్వామివారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శివరాత్రి పురస్కరించుకుని చిత్తూరులోని శ్రీచిదంబరేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ పూజలను వైభవంగా నిర్వహించారు. మూలస్థానంలోని స్వామి వారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి శేషవాహనంలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల ఆందోళన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు చిత్తూరులోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో చిత్తూరు శాఖ ఉద్యోగులు ఆందోళన చేశారు. మూడవ, నాల్గవ తరగతి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, అలాగే తమ యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులు ధనంజయ రెడ్డి, కార్యదర్శి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు పెట్టడం నేరం


అటవీ సంరక్షణపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

గుడిపాల: అడవికి నిప్పు పెట్టడం నేరమని ఫారెస్ట్ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరెడ్డి అన్నారు. అడవులకు నిప్పు పెడితే కలిగే నష్టాలపై గురువారం చిత్తపార, పిల్లారికుప్పంలో గ్రామస్తులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడవులకు నిప్పుపెట్టినా, వన్యప్రాణులను వేటాడిన చట్టపరంగా కేసులు తప్పవన్నారు. అడవుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. కొంత మంది ఆకతాయిలు అటవీప్రాంతం పక్కన నిప్పు పెడుతున్నారని, అలాంటి వారు ఏపీ ఫారెస్ట్ యాక్ట్ 1967 ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఢిల్లీరాణి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ జబిల్లా, అరుణ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర మాలల కార్పొరేషన్ చైర్మన్ రాక

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు శుక్రవారం రాష్ట్ర మాలల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్ రానున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చైర్మన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు వివిధ సంఘాల నాయకులతో డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో సమావేశమవుతారని చెప్పారు. జిల్లాలోని షెడ్యూల్ కులాల సంఘాల నాయకులు, ప్రజలు సమావేశానికి హాజరు కావాలని ఈడీ కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో రెండో రోజైన గురువారం కుంకుమార్చన పూజలు వైభవంగా కొనసాగాయి. అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో దంపతులకు పూజా సామగ్రిని అందజేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీ హోమం, మహా మంగళహారతి చేశారు. 151 దంపతులకు అమ్మవారి సన్నిధిలో లక్ష నామ గలార్చనల మధ్య పూజలు చేయించారు. రెండు రోజులుగా సాగుతున్న లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారంతో ముగియనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

పరేషన్



చౌక దుకాణాలలో నిత్యావసర సరకుల అక్రమాలకు చెక్ పెట్టి, కార్డుదారులకు సజావుగా అందేలా చూడాల్సిన బాధ్యత ఆహార సలహా సంఘాలపై ఉంది. మూడు నెలలకోసారి ఆహార సలహా సంఘం ఆధ్వర్యంలో రేషన్ సరకులపై సమీక్షించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే నియోజకవర్గంలో ఎక్కడా సంఘాల సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు.

- ఆహార సలహా సంఘాలు ఉన్నట్టా.. లేనట్టా..!
- సమావేశాల నిర్వహణ శూన్యం
- రేషన్ సరకులు పంపిణీపై పర్యవేక్షణేదీ?
- సమస్యలను పట్టించుకోని అధికారులు

బంగారుపాళెం: పూతలపట్టు నియోజకవర్గం కేంద్రంతోపాటు బంగారుపాళెం, యాదమరి, తవణంపల్లె, ఐరాల మండలాలు ఉన్నాయి. 236 చౌకదుకాణాలు, 79,338 పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ దుకాణాల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేశారు. సంఘం చైర్మన్‌గా సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు, హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు ఉంటారు. ఆహార సలహా కమిటీకి రేషన్ షాపుల తనిఖీలు, బియ్యం సరఫరాపై నిఘా, తూనికలు-కొలతలపై పర్యవేక్షణ అధికారాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో రేషన్ డీలర్లదే ఇష్టారాజ్యమైంది. చౌక దుకాణాల్లో ఇచ్చే సరకుల నాణ్యతను పట్టించుకునేవారు కరువయ్యారు. రేషన్ షాపుల్లో నిత్యావసర సరకుల పంపిణీలో చోటుచేసుకుంటున్న సమస్యలపై పలుమార్లు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. షాపుల్లో సకాలంలో సరకులు పంపిణీ చేయడం లేదని, కొలతల్లో తేడాలు చోటు చేసుకుంటున్నాయని, ఆన్‌లైన్ పనిచేయలేదని, షాపుల చుట్టూ డీలర్లు ప్రదక్షిణలు చేయించుకుంటున్నారని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దకే సరకులు

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు రేషన్ దుకాణాలకు వెళ్లే అగత్యం లేకుండా ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి నిత్యావసర సరకులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. రేషన్ సరకులు సరఫరా చేసే వాహనాలను నిలిపివేసి తమ ఇష్టమెచ్చినట్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. వికలాంగులు, వృద్ధులు రేషన్ దుకాణాలకు వెళ్లి, క్యూలో నిల్చుని, అవస్థలు పడి, సరకులు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా ఆహార సలహా సంఘాలను ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి సమావేశాలను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

జాడలేని సంఘాలు

గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాప్‌ల్లో చోటు చేసుకుంటున్న లోటుపాట్ల గురించి సమావేశాల్లో సంబంధిత అధికారుల దృష్టికి సంఘ సభ్యులు తీసుకువచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఘాలు పనిచేస్తున్నాయా, లేదా? అనేది సందేహమే. వీటిని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. డీలర్ల సమావేశంతో మమ అనిపిస్తున్నారు.

– ఎల్లప్ప, మాజీ ఎంపిటిసి, బంగారుపాళెం

చర్యలు తీసుకుంటాం

మండలంలో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రేషన్ సరకుల పంపిణీలో చోటు చేసుకుంటున్న సమస్యలపై తనకు సమాచారమిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తా. త్వరలోనే ఆహార సలహా సంఘం ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తాం. రేషన్ పంపిణీలో సమస్యలను గురించి చర్చిస్తాం.

– బాబురాజేంద్రప్రసాద్, తహసీల్దార్, బంగారుపాళెం

శ్వాస మీద ధ్యాసే ధ్యానం


ధ్యానం చేయిస్తున్న బాలాజీ

బంగారుపాళెం : ధ్యానం అంటే శ్వాస మీద ఏకాగ్రతను పెట్టడమేనని సీనియర్ పిరమిడ్ మాస్టర్ బాలాజీ అన్నారు. మండలంలోని కుప్పాలపల్లెలోని బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యాన ఆశ్రమంలో బుధవారం రాత్రి 87వ శ్రీమద్భగవద్గీత ధ్యాన జ్ఞాన సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం ఎలా చేయాలో బాలాజీ వివరించారు. మనుషులు దైనందిన జీవితంలో పలు సమస్యలతో ప్రశాంతతను కోల్పోతున్నారని, కొంత సమయం మనసును ధ్యానం వైపు మళ్లిస్తే ప్రశాంతత లభిస్తుందన్నారు. ధ్యానసాధన సర్వరోగ నివారిణి అన్నారు. దీంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. సమాజంలో మనిషి సన్మార్గంలో పయనించేందుకు భగవద్గీత పారాయణం చేయాలన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ రోహిణి, పెద్ద సంఖ్యలో ధ్యానులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గుడిపాల: గుడిపాల మండలంలో రూ.6.12 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం బొమ్మసముద్రంలో రూ.50లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని, రూ.10లక్షలతో వేసిన రెండు సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అనంతరం గొల్లమడుగు, పానాటూరు, వసంతాపురం, చీలాపల్లె, బసవాపల్లె రైతు సేవా కేంద్రం, శ్రీరంగంపల్లెలో ప్రహరీగోడ, చీలాపల్లెలో గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ అముద, డెప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, టీడీపీ నేతలు సుబ్రమణ్యంనాయుడు, బాలాజి, చెన్నకేశవులునాయుడు (జీజీఎం చారిటబుల్ ట్రస్ట్), ఎంపీడీఓ శివరాజన్, తహశీల్దార్ జయంతి, డీఈలు నవీన్, ప్రసాద్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సామాజిక ముద్ర వేయడం సరికాదు

– జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవులు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షులు రాఘవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా పర్యటనకు విచ్చేసిన ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ ఎన్‌జీఓ అసోసియేషన్‌పై సామాజిక ముద్ర వేసి, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవులు ఖండించారు. గురువారం ఆ అసోసియేషన్ నాయకులు జిల్లా ఎన్‌జీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అనైతిక వ్యాఖ్యలు చేసిన సూర్యనారాయణ తన మనస్తత్వాన్ని చాటుకున్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఆస్కార్‌రావు చేసిన ఆరోపణలకు సూర్యనారాయణరావు సమాధానం చెప్పాలన్నారు. 36 ఏళ్లగా నాయకుడిగా ఉన్నానని ప్రచారం చేసుకుంటున్న ఆయన ఉద్యోగుల చేసిందేమీ లేదన్నారు. సూర్యనారాయణ ఇలాగే వ్యవహరిస్తే ఉద్యోగులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఎన్‌జీఓ సంఘం జిల్లా కార్యదర్శి రఘు, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రదీప్, ట్రెజరర్ మురళి, ఉపాధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.


యూరియా కోసం రైతన్నల పాట్లు

- ఒక గంటలోనే యూరియా మొత్తం ఖాళీ!


యూరియా తీసుకువెళ్తున్న రైతన్నలు

గుడిపాల: యూరియా కోసం రైతన్నలకు పాట్లు తప్పలేదు. వచ్చిన ఒక గంటలోనే స్టాకు మొత్తం ఖాళీ అయ్యింది. గురువారం మధ్యాహ్నం వసంతాపురం సచివాలయానికి 200 బ్యాగుల యూరియా వచ్చింది. ఇది రైతులకు సమాచారం తెలియడంతో ఒక్కో రైతు రెండు నుంచి మూడు బ్యాగులు యూరియా తీసుకెళ్లారు. ప్రస్తుతం వరి పంట, పశుగ్రాసం అధికంగా ఉండడంతో ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు. దీంతో ఒక్కటీ మిగల్లేదని వ్యవసాయశాఖాధికారులు తెలియజేశారు.

సమాజ వికాసానికి భాషే మూలం



–నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

కాణిపాకం: మాతృభాషను మించినది మరొకటి లేదు. భావ వ్యక్తీకరణకు సులభమైన మార్గం అమ్మ భాష, ప్రతి జాతి సాంస్కృతిక వికాసానికి మూలం మాతృ భాషే. ప్రపంచీకరణ నేపథ్యంలో భాషా వికాసం పెరిగింది. మనుగడ కోసం ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పులేదు. కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూడాల్సిన అవసరం ఉంది. తమ మాతృభాషలను కాపాడుకోవాలని గుర్తు చేసేందుకే ప్రతి ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించడం పరిపాటి.

నేపథ్యమిదే..

ప్రపంచీకరణ నేపథ్యంలో కొన్ని భాషల ఉనికి ప్రమాదంలో పడటం ఆందోళన కలిగించే అంశం. మాతృభాష కోసం బెంగాల్ యువకుల ఆత్మ బలిదానం రగిల్చిన ఉద్యమ స్ఫూర్తితో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి పునాది పడింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రతి ఏటా ఫిబ్రవరి 21న నిర్వహించాలని 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా దీనిని నిర్వహిస్తున్నారు.

కుటుంబంలోనే బలమైన పునాది



మాతృభాషలోనే సాహిత్య కల్పన జరుగుతుంది. ఏ జ్ఞానాన్నైనా ఏ భాషలో నేర్చుకున్నా..అవగాహన చేసుకోవడం మాత్రం మాతృభాషతోనే సాధ్యమవుతుంది. అందుకని బోధన కూడా మాతృభాషలోనే ఉండాలి. తల్లిభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇప్పటి తరం పిల్లలకు కుటుంబంలోనే తల్లిదండ్రులు దీనికి బలమైన పునాది వేయాలి.

– మద్రిపూడి దేవేంద్రరావు, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య గౌరవాధ్యక్షులు

అమ్మ భాషను విస్మరించరాదు



మాతృభాషలో మన భావాలను చక్కగా పలికించగలం, అదే ఇతర భాషల్లో సాధ్యం కాదు. అనుభవాలేవో అమ్మ భాషలో ఆదరిస్తాయి. అక్షయమైన ఆలోచనలకు అద్దం పడతాయి.అలాంటి మాతృభాషలు నేడు మృతభాషలుగా కనుమరుగవుతున్నవి లెక్కకు మిక్కిలి. వృత్తి ప్రవృత్తి కోసం ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషను విస్మరించరాదు.

–వైకే. సంధ్యాశర్మ, రచయిత, చిత్తూరు

మున్ముందు మరిన్ని సేవలు చేద్దాం


ప్రశంసాపత్రం అందజేస్తున్న చంద్రరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ తరపున మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేద్దామని జిల్లా గవర్నర్ చంద్రరెడ్డి అన్నారు. చిత్తూరులో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఓ హోటల్లో అధ్యక్షుడు ఎంవీ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్యను అధిగమించేలా సభ్యులంతా కలిసికట్టుగా పనిచేస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ముందుకుపోవాలన్నారు. అనంతరం పలువురిని ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో అశ్వత్ నారాయణ స్వామి, భానుమూర్తిరెడ్డి, ప్రతాప్‌యాదవ్, సుధ, ఎంఎస్ రెడ్డి, సౌమ్య, మనోజ్‌కుమార్ రెడ్డి, ప్రభాకర్, జమీర్ హమ్మద్ పాల్గొన్నారు.

ఎ.గొల్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'


ఎ.గొల్లపల్లెలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: మండలంలోని ఏ.గొల్లపల్లెలో గురువారం తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులు, గర్భవతులు, బాలింతలు, మధుమేహం బాధితులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెలిమండపల్లెలో..


నెలిమండపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మండలంలోని నెలిమండపల్లెలో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు


ఏబీసీ కేంద్రం ప్రారంభోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్ : వీధి కుక్కల కుటుంబ నియంత్రణ కోసం చిత్తూరు నగరపాలక సంస్థ వాహనాల షెడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'అనిమల్ బర్త్ కంట్రోల్' కేంద్రాన్ని (ఏబీసీ) జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. రూ.15 లక్షలు కలెక్టర్ ప్రత్యేక నిధులతో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ చేయడానికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. చిత్తూరు నగరపాలక పరిధిలో సుమారు 7–8 వేల వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా ఉందని.. వీటి జనాభాను నియంత్రించకుంటే భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున.. నగరపాలక పరిధిలో ఏబీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆపరేషన్లు నిర్వహించడంపై జిల్లాలోని పశు వైద్యులు పదిమందికి రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనీలతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఇలాంటి మంచి పనులు చేయడంలో కలెక్టర్ ఎంతో ముందుంటారని అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ జేడీ డా.ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ బీఎస్ రాజసింహులు, ఎంహెచ్వో డా.లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏడీ డా.చంద్రశేఖర్, నగరపాలక, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ, అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రవి

తవణంపల్లె: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా బ్యాంకు అధికారులు లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 80 యూనిట్లు మంజూరు చేశారు. వీటికిగాను నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో 580 మంది దరఖాస్తులు చేసుకోగా 550 మంది ఇంటర్వ్యూలను హాజరైనట్లు అధికారులు చెప్పారు.

బ్యాంకు అధికారులు దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన వారిని ఎంపిక చేసి రుణాలు మంజూరు చేస్తారని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అభ్యర్థులు పాల్గొన్నారు.

రుణాలకొస్తే మొండిచెయ్యి

ఇది ఇలా ఉండగా, బీసీల్లోని ఎ.బి.సి.డి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలలో నిరాశ ఎదురైంది. ఆ గ్రూపులకు తమ బ్యాంకు టార్గెట్ ఇవ్వలేదని అధికారులు చెప్పడంతో చాలా మంది బీసీ నిరుద్యోగులు హతాశులయ్యారు. నిరాశతో తిరుగుముఖం పట్టారు.

కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు మొండిచేయి చూపారని వామపక్షాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నాగరాజన్, గంగరాజు ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బడ్జెట్‌పై పార్టీ ఆదేశాల మేరకు నిరసన వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం రంగాల వ్యయం గతంలో కంటే తగ్గించారన్నారు. అవసరమైనప్పటికీ ఉపాధి హామీ పథకానికి నిధులు అదనంగా కేటాయించ లేదన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో పలు ఇబ్బందులు పడుతున్న కార్మిక వర్గాన్ని ఈ బడ్జెట్ విస్మరించిందన్నారు. పంటలకు కనీస మద్దతు ధరకు కల్పించలేదని విమర్శించారు. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి బదలాయించరాదన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50 శాతం పెంచాలని, అలాగే స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను కూడా పెంచాలన్నారు. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్ చార్జీలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రన్, ఓబుల్‌రాజు, చిట్టెమ్మ, సుబ్రహ్మణ్యం , ప్రసాద్, వినోద్, బాలసుబ్రమణ్యం, గోపీనాథ్, దాసరి చంద్ర, రమాదేవి, విజయగౌరి, మణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆవులపబ్బం ప్రారంభం


చాందినీ బండ్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

చౌడేపల్లె: మండలంలోని పన్నెండు గ్రామాల ప్రజలు కలిసి పరికిదొనలో ప్రతిఏటా నిర్వహించే ఆవులపబ్బం గురువారం కనులపండువగా ప్రారంభమైంది. మహాశివరాత్రి పండుగ ముందు వారంలో ప్రతిఏటా ఆవులపబ్బం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ పండుగను గ్రామస్తులు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ప్రజలందరూ పోటాపోటీగా పశువులను ముస్తాబుచేసి నాగప్ప చెరువులో 12 గ్రామాలకు చెందిన పశువులను ఒకే చోటకు మందగా తోలి పశు సంపద పెరగాలని కోరుతూ కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేశారు.